క్లుప్తంగా

ధర్మారావు సేవలు ఎనలేనివి



ధర్మారావును సత్కరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖ హోం గార్డు విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చెందిన ఎం.ధర్మారావు అందించిన సేవలు ఎనలేనివని ఎస్పీ ఎం. దీపిక అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ కార్యాలయంలో ధర్మారావును సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంత జీవితం గడపాలని ఆకాంక్షించారు. అనంతరం జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, హోంగార్డ్స్ ఇన్‌చార్జ్ ఆర్ఎస్సై కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ కిశోర్‌కుమార్

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు క్యాలెండర్‌ను ఈఓ కిశోర్‌కుమార్ ఆదివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పైడితల్లి అమ్మవారి ముఖచిత్రంతో రూపొందించిన క్యాలెండర్ ప్రతి ఇంట్లోను ఉండాలని పైడితల్లి దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆకాంక్షించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు ఉచితంగా క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, రమేష్ పట్నాయక్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం

నెల్లిమర్ల: సతివాడ పంచాయతీ పరిధిలోని ఎం బేరయ్యగుళ్ల గ్రామంలోనున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పిస్తామని సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

ఉద్యోగుల సహకారం అవసరం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీఈఏ) జిల్లా కమిటీ రూపొందించిన క్యాలెండర్–2023ను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి ఉద్యోగుల సహకారం ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రరావు, కంటి వెంకటరమణ, జిల్లా కోశాధికారి వై.శంకరరావు, ఉపాధ్యక్షుడు బాలాజీ పాణిగ్రహి, పెన్షన్‌దారుల కార్యవర్గ సభ్యుడు పీవీ రమణ, జిల్లా సంయుక్త కార్యదర్శి లెంక సత్తిబాబు, కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి రజత పతకం



విద్యార్థిని హారికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయిని

జామి: మండలంలోని కుమరాం కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో చదువుకుంటున్న బలరాంపురం గ్రామానికి చెందిన విద్యార్థిని కంచర్ల హారిక రాష్ట్రస్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీల్లో రజత పతకం సాధించింది. గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లాలో నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థిని జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి రన్నర్‌గా నిలిచింది. విద్యార్థినిని కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి తదితర ఉపాధ్యాయ సిబ్బంది ఆదివారం అభినందించారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

చీపురుపల్లిరూరల్: పట్టణానికి చెందిన మానవీయతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని 50 మంది నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆసంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు మాట్లా డుతూ ప్రతీ ఏడాది మాదిరిగానే ఈఏడాది కూడా పట్టణంలోని రోడ్లపై, బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో జీవిస్తున్న నిరుపేదలకు దుప్పట్లు అందజేశామని తెలిపారు. అలాగే ఉచిత ఫుడ్‌కోర్టు వద్ద భోజనాలు అందించామని చెప్పారు.

నూతన సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు..

- కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లు
- వేడుకగా కొత్త సంవత్సర సంబరాలు



విజయనగరం: కేక్ కట్ చేస్తున్న ఈశ్వర్‌కౌశిక్, శ్రావణి

విజయనగరం: నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజలకు శుభాలు కలగాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని యువజన విభాగం జిల్లా నాయకుడు జి. ఈశ్వర్ కౌశిక్ ఆధ్వర్యంలో సుజాత కన్వెన్షన్‌లో ఆదివారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో జనరంజక పాలన సాగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ కొత్త సంవత్సరంలో మంచి నిర్ణయాలు తీసుకుని మరింతగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, కార్పొరేషన్, సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సుఖసంతోషాలతో ఉండాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు అన్నారు. స్థానిక కోరాడవీధిలోని సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నాగభూషణం, వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు మజ్జి అప్పారావు, మలిచర్ల దుర్గారావు, రామేశ్వరపు రామారావు, కిల్లంపల్లి ఆచారి, పడగల బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ పోలీస్ స్టేషన్‌లో..

విజయనగరం క్రైమ్: పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ టీవీ తిరుపతిరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సిబ్బంది బాగా పనిచేసి పోలీస్ శాఖకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై గణేష్, ఎంఎస్‌పీలు కుమారి, గౌతమి, భాగ్యశ్రీ, గాయత్రి, కల్యాణి, చంద్రకళ, కృష్ణమ్మ, కుసుమ, దీపిక, నాగమణి, ప్రసన్న, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ కార్యాలయంలో..

విజయనగరం ఫోర్ట్: స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతేడాది కంటే ఈ ఏడాది రైతులు మరింత వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా వాసులంతా 2023 సంవత్సరంలో ఆనందోత్సవాల నడుమ సుఖశాంతులతో గడపాలన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో తీసుకువెళ్తున్న జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అవనాపు విక్రమ్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ ఆధ్వర్యంలో...

విజయనగరం ఫూల్‌బాగ్: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జీసీసీ ఉద్యోగులతో కలిసి గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గణేష్, జీసీసీ బీఎం సింహాచలం, మేనేజర్ పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ: మండల కేంద్రమైన పూసపాటిరేగతో పాటు పలు గ్రామాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. కొత్త సంవత్సరాదికి ఆహ్వానం పలుకుతూ ఇళ్ల ముందు వెల్‌కమ్ 2023 అంటూ రంగురంగుల ముగ్గులు వేశారు. రెల్లివలసలో ఎంపీపీ మహంతి కల్యాణికి పలువురు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావుకు ఉద్యోగులు శుభాకాంక్షలు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామికి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడుకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మండలంలోని కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో క్యాంపస్ చాలెంజ్ డైరెక్టర్ శర్మ, ప్రజాప్రతినిధులు పి.ఎల్లంనాయుడు, ఎంకే మోహన్, విశాఖ గీతం లా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: ఎంపీపీ కల్యాణికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు



పూసపాటిరేగ: క్యాంపస్ చాలెంజ్‌లో నూతన సంవత్సర సంబరాలు జరుపుకుంటున్న దివ్యాంగులు



విజయనగరం ఫోర్ట్: డీసీఎంఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ అవనాపు భావన, విక్రమ్



విజయనగరం ఫూల్‌బాగ్: నూతన సంవత్సర వేడుకల్లో బీసీ సంక్షేమ సంఘం నాయకులు



విజయనగరం క్రైమ్: కేక్ కట్ చేస్తున్న రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్సై గణేష్



విజయనగరం ఫూల్‌బాగ్: కేక్ కట్ చేస్తున్న శోభా స్వాతిరాణి

ముందే వచ్చిన పండగ..

- మండలానికి కొత్తగా 216 పింఛన్ల మంజూరు
- తాజాగా రూ. 250 పెంచడంతో 2,750 రూపాయలకు చేరిన పింఛన్ మొత్తం



చెల్లూరులో లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్, వలంటీర్

విజయనగరం రూరల్: సామాజిక పింఛన్‌దారులకు సంక్రాంతి పండగ ముందే వచ్చేసింది. పింఛన్‌ను రూ. 250 పెంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వితంతవులు, అవ్వా,తాతలకు ఘనమైన కానుక అందించారు. అలాగే మండలానికి కొత్తగా 216 పింఛన్లు మంజూరు చేశారు. ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేపట్టిన సమయంలో పెన్షన్‌దారుల ఇబ్బందులు గమనించిన జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ మొత్తాన్ని 3000 రూపాయల వరకు పెంచుకుంటూ పోతామని హామీ ఇచ్చారు. అనుకున్నట్లు గానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండుసార్లు రూ. 250 చొప్పున 500 రూపాయలు పెంచారు. తాజాగా మరో 250 రూపాయలు పెంచడంతో పింఛన్ మొత్తం 2,750 రూపాయలకు చేరుకుంది. విజయనగరం మండల పరిధిలో 2019 ఎన్నికల ముందు వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 4,778 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి మూడేళ్లలో మండల వ్యాప్తంగా వెయ్యికి పైగా కొత్త లబ్ధిదారులు చేరారు. గత డిసెంబర్ వరకు మండల వ్యాప్తంగా 5,760 మందికి రూ. 2,500ల చొప్పున కోటి 44 లక్షల 30 వేల రూపాయలను వైఎస్సార్ పింఛన్ కానుకగా అందించారు. అలాగే తాజాగా మరో 216 కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో పెంచిన రూ. 250తో పాటు ఒక్కొక్కరికీ రూ. 2,750లు పింఛన్ కానుక అందజేస్తున్నారు.

వారం రోజుల పాటు పింఛన్ల పంపిణీ



మండలంలో పాత పింఛన్‌దారులతో పాటు కొత్తగా మంజూరైన 216 మందికి వారం రోజుల పాటు పండగ వాతావరణంలో గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నగదు అందజేస్తారు. ఒకటో తేదీన కొంతమందికి పింఛన్ అందజేశాం.

– గంటా వెంకటరావు, ఎంపీడీఓ, విజయనగరం మండలం

అర్హతే ప్రామాణికం...

- కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఆదివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. నూతనంగా 1,065 మంది లబ్ధిదారులకు పింఛన్ పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేపట్టిన సమయంలో పెన్షన్‌దారుల ఇబ్బందులను గమనించి, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ మొత్తాన్ని మూడు వేల రూపాయల వరకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. అనుకున్నట్లు గానే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ. 500 పెంచారని, తాజాగా మరో 250 రూపాయలు పెంచడంతో పింఛన్ మొత్తం 2,750 రూపాయలకు చేరుకుందని చెప్పారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, గతంలో చాలీచాలని పింఛన్లు అందేవని.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టిన తర్వాత దశల వారీగా పింఛన్ మొత్తాన్ని పెంచుతూ 2,750 రూపాయలు మంజూరు చేయడం గర్వకారణమన్నారు. గతంలో పింఛన్ల మంజూరులో అనేక అవకతవకలు జరిగేవని, ప్రస్తుతం మాత్రం పారదర్శకంగా జరుగుతోందని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా దళారులు లేకుండా నేరుగా ఒకటో తేదీన పింఛన్ మొత్తం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, కార్పొరేటర్లు గుజ్జల నారాయణరావు, కంటుభుక్త తవిటిరాజు, కనకల నాగవల్లి, టీపీఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.



విజయనగరం: లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

మంత్రి బొత్సకు శుభాకాంక్షలు



మంత్రి బొత్స సత్యనారాయణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



మంత్రి బొత్స సత్యనారాయణతో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్



విజయనగరం ఫోర్ట్: మంత్రి బొత్సకు అభినందనలు తెలుపుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన

విజయనగరం: మంత్రి బొత్స సత్యనారాయణను పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ యూనియన్ల నాయకులు ఆదివారం అతని స్వగృహంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్, తదితర ప్రజా ప్రతినిధులు, ఏఐటీయూసీ నేత ఎస్. రంగరాజు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగడుగుల కామేష్, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, ఎంహెచ్ఓ సత్యనారాయణ, తదితరులు మంత్రిని కలిశారు. మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మిలకు డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, అవనాపు విక్రమ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్ సూర్యకుమారికి శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ గణపతిరావు, ఆర్డీఓ సూర్యకళ

విజయనగరం అర్బన్: నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ ఎ.సూర్యకుమారికి జిల్లా అధికారులు, సిబ్బంది ఆదివారం శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ బంగ్లాలో తొలుత పాఠశాల విద్యార్థులకు ఆమె మీఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆమెను జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్ఓ ఎం.గణపతిరావు, ఆర్డీఓ సూర్యకళ, ఇతర జిల్లా స్థాయి అధికారులు కలిసి నోట్ పుస్తకాలు, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జేసీల క్యాంప్ కార్యాలయాల్లో కూడా కొత్త సంవత్సర సందడి కనిపించింది.

దశాబ్దాల కల సాకారమవుతున్న వేళ

- రూ.4.40 కోట్లతో చంపావతి నదిపై వంతెన నిర్మాణం
- సంతోషం వ్యక్తం చేస్తున్న పత్రువాడ గ్రామస్తులు



జోరుగా సాగుతున్న వంతెన నిర్మాణ పనులు

గజపతినగరం రూరల్:

మండలంలోని గంగచోళ్లపెంట పంచాయతీ పరిధిలోని పత్రువాడ గ్రామ ప్రజల దశాబ్దాల కల ఇన్నాళ్లకు సాకారం కాబో తోంది. గ్రామానికి ఆనుకు ని ఉన్న చంపావతి నదిపై వంతెన నిర్మాణానికి రూ. 4.40 కోట్ల ఏపీఆర్‌ఆర్‌పీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇటీవలే ఈ పనులకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది జూన్ నాటికి వంతెన నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు పనులను శరవేగంగా చేయిస్తున్నారు. పత్రువాడలో సుమారు 350 కుటుంబా లు నివసిస్తున్నాయి. గ్రామానికి చెందిన విద్యార్థులు ఉన్నత పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలన్నా, ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే అత్యవసరంగా ఆస్పత్రికి పోవాలన్నా, అవసరాల నిమిత్తం గ్రామస్తులు ఇతర గ్రామాలకు, మండల కేంద్రానికి వెళ్లాలన్నా గ్రామాన్ని ఆనుకుని ఉన్న చంపావతి నదిని దాటాల్సిందే. నదిపై వంతెన లేక పోవడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో నది ఉధృతంగా ప్రవహించే సమయాల్లో మాత్రం వీరి ఇబ్బందులు వర్ణనాతీతం.

పట్టించుకోని గత ప్రభుత్వం

గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గత ప్రభుత్వంలోని పాలకుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. నదిలో నీళ్ల తక్కువగా ఉన్న సమయాల్లో విద్యార్థులు సైతం నదిని దాటుకుని వెళ్లిపోతుంటారని, వర్షాకాలంలో మాత్రం నానా అవస్థలు పడాల్సి వస్తోందని, సమస్యను పలుమార్లు గతంలో ఎంతోమంది నాయకుల వద్ద ఏ కరువు పెట్టినా పట్టించుకోలేదని గ్రామస్తులు అంటున్నారు. తాము అధికారంలోకి వస్తే వంతెన నిర్మిస్తామని హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్న గత ప్రభుత్వంలోని పాలకులు అధికారంలోకి వచ్చాక ముఖం చాటేశారని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చొరవ తీసుకుని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. నిర్మా ణ పనులు ప్రారంభమై చకచకా సాగుతుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఊహించలేదు



వంతెన లేకపోవడంతో చంపావతి నదిలో నుంచి రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడేవాళ్లం. వర్షాకాలంలో ఎన్నో రోజుల పాటు ఊరు దాటి బయటికి వెళ్లలేక ఇళ్లల్లోనే ఉండే వాళ్లం. ఇక్కడి చంపావతి నదిపై వంతెన నిర్మాణం నేను బతికుంటుండగా జరుగుతుందని ఊహించలేదు. మా దశాబ్దల కల ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వల్ల సాకారమవుతోంది. త్వరలో మా గ్రామస్తులకు ఇబ్బంది తొలగనుంది.

– బుగత నారాయణప్పుడు, పత్రువాడ గ్రామం

జూన్ నాటికి పూర్తి చేస్తాం

గంగచోళ్లపెంట పంచాయ తీ పరిధిలోని పత్రువాడ గ్రామానికి వెళ్లే దారిలో చంపావతిపై వంతెన నిర్మాణానికి ఏపీఆర్ ఆర్‌పీ నిధులు రూ.4.40 కోట్లు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణం జోరుగా సాగుతోంది. ఇటీవలే శంకుస్థాపన చేసి ఇప్పటికే గ్రౌండింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది జూన్ నాటికి వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆదిమూర్తి, పీఆర్ జేఈ, గజపతినగరం.